ఓటుతోనే ప్రజాస్వామ్యానికి మనుగడ



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పరిపాలనాధికారి కె.వసుంధర



మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని రూరల్: ప్రతిఒక్కరికీ ఓటుహక్కు గురించి తెలియజేయాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి కె.వసుంధర అన్నారు. ఈ మేరకు శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయ సిబ్బందితో కలిసి ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిందని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందాలన్నారు. బీఎల్‌ఓలు, అధికారులు గ్రామాల్లోని ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఎన్నికల డీటీ గాయత్రి, డిప్యూటీ తహసీల్దార్‌లు వలిబాషా, రాఘవేంద్ర, వినీత్, కౌసర్‌బాను, బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ఆదోని టౌన్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది కలిసికట్టుగా ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ ఎం.కృష్ణ ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. భారతదేశ పౌరులమైన తామంతా దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామన్నారు. కుల, భాష వర్గం బేధం లేకుండా ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

- నందవరం: ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటర్లతో మండల అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ నాయకుల ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు ఓటు హక్కు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, డీటీ శశిశేఖర్, మండల పరిపాలన అధికారి కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ సందీప్, సర్వే డీటీ మహేష్ పాల్గొన్నారు.



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

స్వేచ్ఛగా ఓటేద్దాం



పెద్దకడబూరు తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దారు శ్రీనాథ్, సిబ్బంది

పెద్దకడబూరు: ప్రతిఒక్కరూ ఓటరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుందామని తహసీల్దారు శ్రీనాథ్ అన్నారు. శనివారం నేషనల్ ఓటర్స్ డేను పురస్కరించుకొని మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ముందు శుక్రవారం ఓటుహక్కును వినియోగించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ పౌరులందరూ ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ఓటు వేయాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

'నాకే మార్కెట్ యార్డు చైర్మన్ పదవి'!

గోనెగండ్ల: ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి తనకే వస్తుందని.. ఇందుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి కూడా హామీ ఇచ్చారని గోనెగండ్ల మండలం మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు గాజుల దిన్నె హనుమంతు అన్నారు. శుక్రవారం గోనెగండ్లలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీపై ఇటీవల కొంత మంది గిట్టని వారు ఉద్యోగాలు, నామినేటెడ్ పోస్టులకు డబ్బులు వసూలు చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. టీడీపీ కురువ సామాజిక వర్గానికి చెందిన వారిలో సీనియర్ నాయకుడు తనేనని.. అందుకే పదవి తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కమిషనర్ విస్తృత పర్యటన

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. మున్సిపల్ మెయిన్ రోడ్డు, మరాఠీగేరి, పాత బస్టాండు, రైల్వేస్టేషన్ రోడ్డు, వెంకన్నబావి ఏరియా, పరిషముల్లా తదితర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి మురుగు కాలువల్లో పూడికతీత పనులు, రోడ్లపై చెత్త కుప్పల తొలగింపు, రోజువారీగా లభ్యమయ్యే తడి, పొడి చెత్త సేకరణ, ఆటోల్లో తడి, పొడి చెత్తను తరలించే తీరును తనిఖీ చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అంటువ్యాధుల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, శానిటేషన్ అధికారులు, వర్కర్లకు సూచించారు. అన్నా క్యాంటీన్‌లలో పేదలకు అందిస్తున్న భోజనం, నాణ్యత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

క్లుప్తంగా

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు: పశు వైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య అధికారి జ్యోష్న సూచించారు. మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాడి పశువులకు వైద్యం చేయడంతో పాటు యజమానులకు, గొర్రెల కాపరులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులకు వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులు వ్యాధుల బారిన పడితే తక్షణమే స్థానిక పశు వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించి వాటిని కాపాడుకోవాలన్నారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలో ఇళ్లు లేని నిరుపేదలు ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను పరిశీలించి, ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం రూ.2.50 లక్షలను ఇవ్వనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో 1860 దరఖాస్తులు వచ్చాయన్నారు. రెండో విడత కింద 1080 దరఖాస్తులు రాగా, వాటిని హౌసింగ్ బోర్డు అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. మొదటి విడతలో 560 ఇళ్లు మంజూరయ్యాయని, నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లయితే బిల్లులను కూడా అదే స్థాయిలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సొంతిల్లు లేని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన అధ్యక్షులకు సత్కారం



సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీలో పలు అనుబంధ విభాగాలకు కొత్తగా నియామకమైన అధ్యక్షులను పార్టీ నాయకులు స్థానిక కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్, యూత్ అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, నందవరం మండల పార్టీ అధ్యక్షుడు శివప్పగౌడ్, సోషల్ మీడియా అధ్యక్షుడు నాయక్ ఎండీ షరీఫ్‌లను అభినందించారు. నాయకులు లతారెడ్డి, విరుపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, ఆర్ఎస్ బాషా, మంజునాథ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్

ఎమ్మిగనూరుటౌన్: డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలు జరగవని ఆదోని ఎంవీఐ కేఎండీ అవేష్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన డ్రైవర్స్ డేలో ఆయన పాల్గొన్నారు. ఆర్టీసీ డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపి పలు సూచనలు చేశారు. వాహనాలు నడిపే సమయంలో రహదారి సూత్రాలను అనుసరించాలని.. వేగాన్ని నియంత్రించుకుంటే ఇటు డ్రైవర్లు, ప్రయాణికులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుతారని తెలిపారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జ్ సీఐ ఎల్లప్ప, డిపో యునియన్ నాయకులు ముస్తక్‌అహ్మద్, రఫీక్, నవాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో వెలసిన హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు శుక్రవారం ఘనంగా జరిగింది. దర్గాకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత రెడ్డి, వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్, గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు సుశీలమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గాను విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. అలాగే ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉరుకుంద ఆలయానికి రూ.51వేలు విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఉరుకుంద మజరా గ్రామం అయిన ఓబుళపురం వాసులు చందాలు వేసుకుని రూ.51,116లను పోగుచేసి ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజుకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

27న వేలం పాటలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన ఇత్తడి గంటలతో పాటు వివిధ రకాల సామాన్లకు బహిరంగ వేలం ఈనెల 27న సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఇత్తడి గంటలు, అల్యూమినియం గుర్రములు, కోరమీసాలు, కనుగుడ్లు, పాత ఇనుప సామాగ్రి, నెయ్యి ఖాళీ డబ్బాలు, నూనె ఖాళీ డబ్బాలను వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం దేవాలయ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

ఆదోని టౌన్: ఆదోని డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి, బాత్‌రూమ్, లెట్రిన్‌ల వసతి కల్పన కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆదోని డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాత్‌రూమ్‌లు, లెట్రిన్‌ల కోసం రూ.91.08 లక్షలు, తాగునీటి వసతి కోసం రూ.65.45 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుంచి నిధులు మంజూరైనట్లు తెలిపారు. డివిజన్‌లో 255 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాత్‌రూమ్‌లు, లెట్రిన్‌లు, 385 స్కూళ్లలో తాగునీటి వసతి కల్పించనున్నామని చెప్పారు. 255 బాత్‌రూమ్, లెట్రిన్‌లకు గానూ 180 పూర్తి చేశామన్నారు. 385 స్కూళ్లల్లో 340 సెంటర్‌లలో తాగునీటి వసతి కల్పించామన్నారు. మిగిలిన సెంటర్‌లలో త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. నిధులు కొరత ఏమీ లేదన్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పలు విభాగాలకు కొత్తగా నియామకమైన అధ్యక్షులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సూచించారు. తాలుకా ఐటీ విభాగానికి అధ్యక్షుడిగా నియమితుడైన మాచాని సోమేశ్ శుక్రవారం మాజీ ఎమ్మెల్యేను, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిని వారి నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. శాప్‌నెట్‌వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, ఎంపీపీ కేశన్న, వైస్ ఎంపీపీ పోలయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య, రియాజ్‌అహ్మద్, టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్లు రంగన్న, రజాక్ తదితరులు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు మాచాని సోమేశ్

డ్రైవర్లకు గుర్తింపు ఇవ్వాలి

గోనెగండ్ల: డ్రైవర్లకు గుర్తింపు ఇవ్వాలని సౌత్ ఇండియా సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు అన్వర్ బాషా కోరారు. శుక్రవారం గోనెగండ్ల నీలకంఠేశ్వరస్వామి కుర్ని కల్యాణ మండపంలో సౌత్ ఇండియా సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ గంగాధర్ మాట్లాడుతూ.. ప్రతి డ్రైవర్ లైసెన్స్, హెల్మెట్, యూనిఫాం, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ ఉంచుకోవాలని సూచించారు. అలాగే సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. వాహనాలకు వాడే వైట్ లైట్లను వాడరాదని వీటి వల్ల ఎదుటి వ్యక్తికి ఇబ్బంది కలిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బుట్ట ప్రకాష్, ఖాజా ఖాద్రీ, సెక్రటరీ మస్తాన్ వలి, జయింట్ సెక్రటరీ డి.వలి, ట్రెజరర్ మోహిన్, కార్యవర్గ సభ్యులుగా గజేంద్ర, ఉత్తేజ్, చంద్రశేఖర్, సుంకన్న, షేక్షావలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

రోడ్డు నియమాలు పాటించాలి

వాహన డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీఓ మహమ్మద్ ఆవిష్ అన్నారు. శుక్రవారం గోనెగండ్లలో డ్రైవర్స్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


రాజకీయ దురుద్దేశంతోనే ఎస్సీ, ఎస్టీ కేసు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు కనిపిస్తోందని, కేసులు పెట్టి బెదిరించాలని చూస్తే బెదరమని ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత నెల 14వ తేదీ సాగునీటి సంఘం ఎన్నికల్లో పార్లపల్లె గ్రామంలో ఏకపక్షంగా ఎన్నికలను నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఆక్కడికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఓ సీఐ ఏకవచనంతో తిట్టి అవమానపరిచారని తెలిపారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెన్నకేశవరెడ్డిపై సీఐ ప్రవర్తనకు నిరసనగా డిసెంబర్ 15వ తేదీ పట్టణంలోని సోమప్ప సర్కిల్ వద్ద ధర్నా చేసినట్లు గుర్తు చేశారు. ఆ సమయంలో లౌడ్‌స్పీకర్‌కు అనుమతి లేదని పేర్కొంటూ ఎస్ఐ నాయక్ స్పీకర్ తీసుకోవడంతో పార్టీకి చెందిన రవికుమార్‌రెడ్డి ఎస్ఐతో వాగ్వాదం చేయగా సీనియర్ నాయకులంతా కలిసి సమస్య సద్దు మనిగేలా చేశారన్నారు. ఈనెల 12వ తేదీ తనను కులం పేరుతో దూషించారని 8 మంది పార్టీ నాయకులపై ఎస్ఐ ఫిర్యాదు చేయడం.. ఆ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నెల తరువాత కేసు నమోదు చేయడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న వ్యక్తితో పాటు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఒత్తిడితో కేసు బనాయించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యేకు సీఐ క్షమాపణ చెప్పాలని లేకపోతే పట్టణం బంద్ చేస్తామని నాడు పిలుపునిస్తే పోలీసు ఉన్నతాధికారుల సూచనతో పోలీసులకు గౌరవం ఇచ్చి వాయిదా వేశామన్నారు. ఎస్ఐ నిజాయితీగా కేసును విరమించుకోవాలని కోరారు. జాతరలోఎంపీపీ కేశన్నను లోపలికి రాకుండా అడ్డుకున్నారని గుర్తు చేశారు. కక్షపూరిత రాజకీయాలు మానుకుంటే బాగుంటుందని హితవుపలికారు. పార్టీ నాయకులు శివప్ప గౌడ్, రాజశేఖర్, ఎంకే శివప్రసాద్, పేట శ్రీనివాసరెడ్డి, అల్తాఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్, ఎంపీపీ కేశన్న


ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు నాగేశప్ప

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని 28వ వార్డు వెంకటాపురం కాలనీలో కౌన్సిలర్ బజారి అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య మంచి సఖ్యత ఉంటేనే కక్షిదారులకు న్యాయం జరుగుతుందని సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి పి.జె.సుధ అన్నారు. శుక్రవారం ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి పి.జె.సుధ దృష్టికి తీసుకెళ్లారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుందర్‌సింగ్ మాట్లాడుతూ.. కక్షిదారుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని న్యాయమూర్తులను కోరారు. సీనియర్ న్యాయవాది దేశాయ్ మాట్లాడారు. సీనియర్ న్యాయవాదులు వై.ఆర్.మల్లికార్జున, విరూపాక్షిరెడ్డి, శివకుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత బాలుడిని ఆదుకోండి

ఆదోని అర్బన్: ఆరు నెలల క్రితం ఇస్వీ గ్రామంలో విద్యుదాఘాతానికి గురైన ఏడేళ్ల బాలుడు హుసేన్‌ను ఆదుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి జిల్లా కలెక్టర్‌కు సమావేశంలో విన్నవించారు. దీంతో కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ బాలుడికి రావాల్సిన సదుపాయాలు, సౌకర్యాలు వెంటనే అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇస్వీ గ్రామంలో పాఠశాల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో బాలుడు హుసేన్ ఆడుకుంటూ విద్యుదాఘాతానికి గురికావడంతో ఒక చెయ్యి పూర్తిగా దెబ్బతిందన్నారు. చెయ్యికి రెండు ప్లాస్టిక్ సర్జరీలు చేశారని, మూడవ ప్లాస్టిక్ సర్జరీ త్వరలో చేస్తారని చెప్పారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి బాలుడికి ఆర్థిక సాయం అందించాలని, ఆ కుటుంబానికి బతుకుదెరువు చూపాలని కోరారు. సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీన ఆదోని పట్టణంలో చేపట్టే ట్రాక్టర్, బైకు ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘాల నాయకులు వెంకటేశులు, గోపాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు ఈరన్న, యంకన్న, గోపాల్, తిప్పన్న, లింగన్న, వీరేష్, వెంకప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణాధ్యక్షుడు టి.వీరేష్ డిమాండ్ చేశారు. స్థానిక జేబీ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీన విజయవాడలో జరిగే ఆటో యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ నాయకులు నరసింహులు, చిట్టిబాబు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

నందవరం: గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎంపీడీఓ పుల్లయ్య ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్వో ప్లాంట్, జలజీవన్ పనులు, ఆధార్ సేవలు, గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని తిమ్మారెడ్డి నీటి కుంట ద్వారా గ్రామాల్లో నీటి సరఫరా చేయాలన్నారు. 6 ఏళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు, వ్యవసాయ పరపతి సంఘం ఖాతాదారులకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూర్తి, ఈఓపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ అందించి ఆదుకోవాలి

- అగ్నిప్రమాదం జరిగిన పరిశ్రమను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సాయి
- రూ.12 కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనా



పరిశ్రమ యజమానితో మట్లాడి నష్టం వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని అర్బన్: ఎంతోమందికి ఉపాధి కల్పిస్తూ ప్రభుత్వానికి రుసుము కడుతూ వ్యాపారం చేస్తున్న తరుణంలో ఇలాంటి అగ్ని ప్రమాదం జరగడం బాధగా ఉందని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక బసాపురం రోడ్డులో ఉన్న సంతోష్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.9 కోట్లు విలువ చేసే పత్తి సరుకు దహనమైన విషయం విధితమే. ఈ మేరకు శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగిన పరిశ్రమను మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. పరిశ్రమ యజమాని ప్రశాంత్‌తో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ మొత్తం కలియతిరిగి పరిశీలించారు. ఎంతో కష్టపడి పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటే ఇలాంటి ప్రమాదాలు జరగడం చాలా బాధగా ఉందన్నారు. ఇన్సూరెన్స్ వారు త్వరితగతిన క్లెయిమ్ చేసి పరిశ్రమ యజమానులకు వచ్చే పరిహారం త్వరగా అందేలా సహకరించాలన్నారు. చాలా ఫ్యాక్టరీల్లో ఇప్పటివరకు ఇన్సూరెన్స్ రావడం లేదని చెబుతున్నారని, సరైన రికార్డులు ఉంటే ఇన్సూరెన్స్ వస్తుందని తెలిపారు. ఎండాకాలం వస్తుందని, పరిశ్రమల యజమానులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిశ్రమల నిర్వాహకులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఈ పరిశ్రమల్లో సరుకు విలువ రూ.9 కోట్లు, మిషనరీ విలువ రూ.3 కోట్లు, మొత్తం రూ.12 కోట్లు దహనం కావడం బాధగా ఉందన్నారు. పత్తి సరుకు వేసిన రైతులు డబ్బు కోసం ఓపికతో ఉండాలని, పరిశ్రమ వారికి సహకరించి కొంత సమయం ఇవ్వాలన్నారు. నాయకులు నీలకంఠప్ప, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



గోనెగండ్లలో రీసర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు రీ సర్వేతో పరిష్కారం అవుతాయని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మండల కేంద్రం గోనెగండ్లలో జరుగుతున్న రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. రీ సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేసి నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గోనెగండ్ల పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైనందున రీసర్వే సంబంధించి ప్రతీది క్షేత్రస్థాయిలో చేయడం జరుగుతుందని.. భూ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయన్నారు. రీసర్వే జరుగుతున్న ప్రాంతంలో రైతులు సర్వే అధికారులకు సహకరించాలని కోరారు. సర్వే అనంతరం విస్తీర్ణం, సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తారని తెలిపారు. అనంతరం గోనగండ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏయే సమస్యలపై ప్రజల నుంచి ఎక్కువగా వినతులు వస్తున్నాయని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ కుమారస్వామి, రీసర్వే డీటీ శిరీష, మండల సర్వేయర్ అబ్దుల్ హమీద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా రీసర్వే

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో రీసర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నట్లు తహసీల్దార్ రుద్రగౌడ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ నుంచి రీసర్వేను ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామంలో సర్వే నంబర్ 198లో 1474.24 ఎకరాల భూములు ఉండగా 368 పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 399.15 ఎకరాల కొండ విస్తీర్ణం ఉందన్నారు. గ్రామంలో 3 బృందాలుగా ఏర్పడి రోజుకు 25 ఎకరాల చొప్పున రైతుల సమక్షంలో పకడ్బందీగా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. రైతులు దగ్గరుండి సర్వేకు సహకరించాలని కోరారు. మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ, వీఆర్వోలు ఉన్నారు.

శిక్షణతో పాటు ఉపాధి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వివిధ వృత్తుల్లో కొనసాగుతున్న వారికి, నిరుద్యోగులకు మెరుగైన శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి మార్గాలు చూపడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్ మేళా నిర్వహించారు. ఔత్సాహికులకు ఏసీ, వాషింగ్‌మెషిన్, టీవీ, ఎలక్ట్రానిక్, ప్లంబింగ్ విభాగంతో పాటు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆయా విభాగాల్లో ఆసక్తి ఉన్న వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి శిక్షణ ఇస్తామని, అనంతరం సర్టిఫికెట్ ఇవ్వడమే కాకుండా ఉపాధి చూపిస్తామని చెప్పారు.

బాలికల అభ్యున్నతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న పురపాలక కమిషనర్ కృష్ణ,



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న డాక్టర్ మౌనిక

ఆదోని సెంట్రల్: బాలికల అభ్యున్నతికి కృషి చేయాలని పురపాలక కమిషనర్ కృష్ణ, డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, తహసీల్దార్ శివరాముడు సూచించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, మహిళా పోలీసులకు కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమం శుక్రవారం సీడీపీఓ ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ.. బాల్యంలో వివాహాలు చేయడం వల్ల జరిగే నష్టాలు, ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. ఆత్మరక్షణ, డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్ పై బాలికలు జాగ్రత్తగా ఉండేలా చూడాలన్నారు. రజక సంఘం చైర్‌పర్సన్ సావిత్రి, వేదావతి, జోనాథన్ వీక్లిఫ్ పాల్గొన్నారు.

కోసిగి: బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని కోసిగి ప్రాథమిక కేంద్రం వైద్యాధికారిణి మౌనిక సూచించారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ శంకరయ్య, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సీఐ గంగాధర్ అన్నారు. మండల పరిధిలోని కన్నూరు పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. జాతీయ బాలికాదినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన, చిత్రలేఖనంలో గెలుపొందిన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. ఫౌండేషన్ సభ్యుడు శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటేష్, హెచ్ఎం పరమేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ రత్నమ్మ, ఎంపీటీసీ మద్దయ్య పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఆడపిల్లలంటే చిన్న చూపు చూడవద్దని, బాలికాభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా సూచించారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు వైస్ ప్రిన్సిపాల్ సుశీలమ్మతో కలిసి బహుమతులు అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన కురువ వీరేంద్ర పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర శుక్రవారం తెలిపారు. నాగేంద్రకు ఆలూరు మండలం మణెకుర్తికి చెందిన లక్ష్మితో వివాహమై నాలుగు నెలలైందని, మానసికంగా కుంగిపోతూ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు భార్య తెలిపిందన్నారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని బసాపురం రోడ్డులో బుధవారం సంతోష్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంపై శుక్రవారం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పరిశ్రమ యజమాని ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ రామ్‌నాథ్ తెలిపారు. రూ.4.95 కోట్ల పత్తి, దూది బేళ్లు కాలిబూడిదయ్యాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

'పది' మోడల్ పేపర్స్ విడుదల

కోసిగి: మండల పరిధిలో కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి పరీక్ష మోడల్ పేపర్లను శుక్రవారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు మోడల్ పేపర్‌లను వినియోగించుకుని మంచి మార్కులు సాధించాలన్నారు.